# మంగ మహారాజులు

[తరుణ మాసపత్రిక]

"సిగ్గులేదూ ? మోకాళ్ళ వరకూ పరికిణీ ఎత్తుకుని కూర్చున్నావ్! ఇంకా పాపాయి ననుకుంటున్నావేమిటి? ఛీ!" చేతిలోని వేడి అట్లకాడతో నా తొడమీద వాత పెట్టింది అక్క !

ఆ సమయంలో ఆపద్బాంధవుడిలా వచ్చేడు బావ !

కానీ....చివరకు జరిగిందేమిటి?....

## మగ మహారాజులు

ఎండ !

మండుతోంది! మండిస్తోంది!

లోకమంతా నిప్పుల గుండంలా వుంది!

వంటింట్లో గిన్నెలు సర్ది వీధి అరుగుమీద వచ్చి నిలబడ్డాను. ఎక్కడా గాలి ఆడటంలేదు. ఉక్కగా, చికాకుగా వుంది.

చేతులకున్న తడిని పరికిణీకి అద్దుకున్నాను. పరికిణీ తగలగానే అరచేతులు మండిపోయాయి. బాధతో పిడికిళ్ళు మూసుకున్నాను. మంట తగ్గలేదు. మెల్లగా పిడికిళ్ళు విప్పాను. చేతులు యెర్రగా వాచిపోయి వున్నాయి.

నీళ్ళు తోడి తోడి చేతులు బొబ్బలెక్కిపోయాయి.

బిందెతో నీళ్ళు మోసి మోసి భుజాలు కాయలు కాసిపోయాయి.

నూతినుండి వంటింట్లోకి నడిచి నడిచి కాళ్ళు వాపు లెక్కిపోయాయి.

ఛీ! పాడుబతుకు! ఈ బతుకు బ్రతకటం కంటె చావటం మేలు!

“ఇంక ఈ నీళ్ళు తోడకూడదు ! తోడినా భుజాలమీద బిందె మొయ్యకూడదు ! మోసినా వంటింటి దాకా బిందె తీసుకురాకూడదు ! దారిలో బిందె ఎత్తెయ్యాలి-అక్కయ్యను పీక పిసికి చంపెయ్యాలి” కసిగా ఆలోచిస్తున్నాను.

“పాడుముండా! వీధిలో నిలబడి ఏం చేస్తున్నావే? వంటిల్లు కడగవేమిటి? నిండా పదిహేనేళ్ళు రాకపోయినా షోకులకు మాత్రం తక్కువ లేదు!” అక్కయ్య లోపలినుండి అరుస్తోంది.

నా ఆలోచనలకు ఆనకట్టపడింది.

నా లోని కసి పారిపోయింది.

నేను నీళ్ళబిందెను ఎత్తెయ్యలేను.

అక్కయ్యను పీక పిసికి చంపెయ్యలేను.

అక్కయ్య పేరు వింటే నాకు భయం! అక్కయ్య మాట వినబడితే భయం! అక్కయ్య ఉనికే నాకు భయం! భయం!

అక్కయ్య పేరు నాకు కొత్తది కాదు, మాట కొత్తది కాదు, ఉనికి కొత్తది కాదు. అయినా నాకు భయం!

కాళ్ళీడ్చుకుంటూ వంటింట్లోకి వెళ్ళేను. చేతిలోని చీపురు కట్టతో నా నడ్డిమీద ఒక్కటి అంటించింది. ఆ చీపురే మళ్ళీ నాకు అందించింది వంటిల్లు కడగటానికి!

సరిగ్గా ఆ సమయంలోనే వచ్చేడు బావ!

బావ నా పాలిట ఆపద్బాంధవుడు, బావ నా పాలిట దేవుడు!

"మాటి మాటికీ దాన్నెందుకు చంపుకుతింటావ్? ఒక్కసారే పీక పిసికి నూతిలో పారెయ్యరాదూ? నిండా పదిహేనేళ్ళు లేవు. అయినా ఇంట్లో చాకిరీ అంతా గొడ్డులా చేస్తోంది. నీకు ఆ మాత్రం జాలి అయినా లేదు" అంటూ అక్కయ్యమీద విరుచుకుపడ్డాడు.

నాకు గుండెల్లోంచి ఏడుపు తన్నుకొస్తోంది.

చీపురుదెబ్బకు నడ్డి మండిపోతోంది. చెమటతో వీపు చిర చిర లాడి పోతోంది. బాల్చీలోంచి దోసెడు నీళ్ళు తీసి నడ్డిమీద ఒంపుకున్నాను.

వంటిల్లు కడిగి తలుపులు దగ్గరగా వేసి బయటకు వచ్చాను.

గదిలోకి ఓరగా చూశాను, మంచంమీద నిద్రపోతోంది అక్క, బావ ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. నా అలికిడి వినబడింది కాబోలు, పుస్తకంలోంచి తలయెత్తి చూసేడు. భయంగా ప్రక్కకు తప్పుకొని ఇవతలి గదిలోకి వచ్చేశాను. కిటికీలో నుండి ఆవలకు చూస్తూ నిలబడ్డాను.

"కమలా!"

తుళ్ళిపడి చూసేను.

నా ప్రక్కనే బావ! చిన్నగా నవ్వుతున్నాడు.

బావ కనులనిండా దయ! పిలుపు నిండా ఆప్యాయత! గుండెల నిండా సౌహార్ద్రత!

బావవంక గుబులు నిండిన కళ్ళతో చూసేను.

"కమలా! మీ అక్క గట్టిగా కొట్టిందా?" మెల్లగా అన్నాడు.

లేదన్నట్టు తల అడ్డంగా ఆడించేను.

"కొట్టినా నువ్వు చెప్పవులే! ఏదీ ఎక్కడ కొట్టిందో చూడనియ్యి" అంటూ నాకు మరింత చేరువగా వచ్చేడు.

నేను సిగ్గుతో ముడుచుకుపోయాను.

మెల్లగా నడ్డిమీద జాకెట్టు తొలగించి చూసేడు.

నేను మవునంగా వుండిపోయాను.

"అర్రె! ఎర్రగా ఎలావాచిపోయిందో! కొబ్బరినూనె రాస్తానుండు" అంటూ వెళ్ళిపోయాడు.

బావ వాత్సల్యానికి కళ్ళనీళ్ళు తిరిగేయి.

కొద్దిసేపట్లో కొబ్బరినూనె తీసుకువచ్చాడు. నా వీపుమీద మెల్లగా రాస్తూ అన్నాడు "కమలా! మీ అక్కకు కోపం రాకుండా నడుచుకో! కోపంవస్తే అది మనిషి కాదు...."

అలాగే అన్నట్లు తల వూపేను.

బావ వెళ్ళిపోయాడు.

బావకు ఈ మాత్రం అభిమానం వుండటంవలననే యింకా ఈ ఇంట్లో నేను బ్రతుకుతున్నాను.

లేకపోతే నాకు దిక్కెవరు ?

అక్కయ్య నాకు స్వంత అక్కయ్య కాదు ! సవితి అక్కయ్య! నాకు ఎనిమిదేళ్ళు నిండకుండానే నెల తేడాలో అమ్మా నాన్నా పోయేరు. అప్పటికే అక్కయ్య అత్తారింటికి వెళ్ళిపోయింది.

అమ్మా నాన్న పోయేక బావ పోరుమీద అక్కయ్య నన్ను ఇక్క-

డికి తీసుకువచ్చింది. మా అమ్మ చిన్నప్పుడు తనను బాధ పెట్టిందనే నెపంతో ఇపుడు నామీద కసి తీర్చుకుంటోంది అక్కయ్య.

చాప వేసుకొని వరండాలో నడుం వాల్చేను. అలసిపోయిన శరీరం ఆలోచనల మధ్య నిద్రలోకి జారిపోయింది.

అక్కయ్య దీవెనలతో మళ్ళీ మెలకువ వచ్చింది.

“పగలు కూడా పాడు నిద్రే. లేచి అంట్లు పెరట్లో పడెయ్యి. పని మనిషిపోతే నువ్వే తోమాలి!” అంటూ అరుస్తోంది.

హడావిడిగా లేచి అంట్లు పెరట్లో పడేశాను.

మురికి గుడ్డలు ఉతికి ఆరేశాను.

పనిమనిషి తోమిన గిన్నెలు వంటింట్లో సర్దేను.

తరువాత రాత్రి వంట! అంటు కంచాలు కడగటం! రాత్రి పదకొండు గంటల వరకూ పని! తరువాత నిద్ర! తెల్లారితే మళ్ళీ మామూలు దినచర్యే.

రేపును గురించి ఆలోచించాలంటేనే నాకు భయంగా వుంటుంది. నాకు జ్ఞానం వచ్చేక జ్ఞాపకం వుంచుకునేందుకు ఒక్క మంచి సంఘటన అయినా జరగలేదు నా జీవితంలో.

పక్కింటివాళ్ళ అమ్మాయి వాణి నా ఈడుదే! ఈ మధ్యనే తను కూడా పెద్దమనిషయింది. రంగు రంగుల పరికిణీలు కట్టుకొని ఓణీలు వేసుకుంటుంది. నీటుగా ముస్తాబు చేసుకుంటుంది. రెండు జడలు వేసుకొని రోజూ పువ్వులు తురుముకుంటుంది. నాకూ అలా ముస్తాబు చేసుకోవాలని వుంటుంది. కాని తిండికే ముఖం వాచిపోతూంటే రంగు రంగుల ఓణీలు, రోజూ పువ్వులు ఎక్కడనుండి వస్తాయి ?

నిద్రపట్టక చాలా సేపు పక్కమీద దొర్లేను.

* * *

రోజులు భారంగా దొర్లిపోతున్నాయి.

నా శరీరములో నాకు తెలియకుండానే వింత మార్పులు వస్తున్నాయి.

రోజు రోజుకీ కాస్త పుష్టిగా తయారవుతున్నాను.

ఒంట్లోని ఒంపులన్నీ వింతగా బయటకు తొంగి చూస్తున్నాయి. అక్కయ్య ఈ సంగతి గమనించి నట్లుంది. "నువ్వు పెద్దదాని వయ్యావ్! మొరడుగా తిరగకు!" అంటూ తన పాత చీరెలు రెండు చింపి ఓణీలు కుట్టించి ఇచ్చింది. ప్రతి నిమిషం నా వెనకనే తిరుగుతూ "పమిట సరిచేసుకోవే ఎడ్డి మొహమా" అంటూ మందలిస్తోంది.

పమిట సరిగా లేకుండా కనుపిస్తే ఒకటి రెండుసార్లు చీపురు తిరగేసింది. ఆఖరికి నా వయస్సే నాకు కంటకంగా తయారవుతోంది కాబోలు అనుకున్నాను.

ఒక దినం అక్కయ్య గది ముందునుండి వెళ్తున్నాను. అక్కా, బావా లోపల ఏదో మాట్లాడుకుంటున్నారు. వారి మాటల్లో నా ప్రసక్తి వినిపించి ఆగిపోయాను.

"కమలకు ఏదైనా సంబంధం చూస్తే బాగుంటుందేమో" అంటున్నాడు బావ.

"దాని మొహం, దానికి పెళ్ళెందుకు?" అంటోంది అక్కయ్య.

బావ సమాధానం కోసం ఎదురుచూసేను.

బావ ఏమీ మాట్లాడలేదు.

నాకీ ఇంటినుండి తొందరగా విముక్తి లభించాలి.

విముక్తి లభించాలంటే నాకు వివాహం కావాలి.

అవును, నాకు పెళ్ళి అయిపోతే ఎంత బావుంటుంది!

జీవితానికి పెళ్ళి అవసర మేమిటో నాకింకా నిశ్చయంగా తెలీదు.

కాని ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవటానికి, ఈ బాధలు తప్పించుకోటానికి పెళ్ళి అవసరమని నిశ్చయంగా తెలుసు.

అందుకే నాకు జీవితంలో మొదటిసారిగా అనిపించింది. "నాకు తొందరగా పెళ్ళి అయిపోతే బాగుండును" అని.

కానీ, నాకా అదృష్టం ఇంతలో కలుగదు.

నాకీ చెర ఇంతలో తప్పదు.

నాకీ చాకిరీ ఇంతలో వదలదు.

అక్కయ్య నాకు పెళ్ళి చెయ్యదు.

వీధి వరండాలోకి వచ్చి నిలబడ్డాను.

వాణీ వాళ్ళింట్లోంచి ఎవరో యువకుడు బయటకు వచ్చాడు. వెను కనే వాణీ నాన్నగారు కూడా వచ్చేరు. రెండు నిమిషాలు ఏదో మాట్లాడేక ఆ యువకుడు రోడ్డుమీద కారెక్కి వెళ్ళిపోయాడు. పదినిమిషాల తరువాత వాణీ బయటకు వచ్చింది ఆమెవైపు సంభ్రమంతో చూసేను.

వాణీ కొత్త బట్టలు కట్టుకొంది. జడనిండా పూలు పెట్టుకొంది. మెడలో ముత్యాల నెక్లెస్, చెవులకు కొత్త జూకాలు, పెళ్ళికూతురిలా మెరిసిపోతోంది.

"వాణి! ఇందాక వచ్చిందెవరు?" మెల్లగా అడిగేను.

నా ప్రశ్నకు వాణీ సిగ్గుపడింది.

"నన్ను చూసుకోటానికి వచ్చేరు" అంది మెల్లిగా.

నాకు అర్థమయింది. ఆ యువకుడు పెళ్ళికొడుకన్న మాట.

"ఆ కారు వాళ్ళదేనా?" అన్నాను.

వాళ్ళదే నన్నట్లు తల వూపింది. అంతలోనే వాళ్ళ నాన్నగారు పిలిస్తే లోనికి వెళ్ళిపోయింది.

వాణీ ఎంత అదృష్టవంతురాలు. హాయిగా పెళ్ళి చేసుకుంటోంది. మొగుడితో కారులో విలకలా తిరుగుతుంది.

పెరట్లోకి వెళ్ళి కొబ్బరి ఆకులన్నీ చీరి ఈనెలు తీశాను. ఈనె లన్నీ కత్తితో శుభ్రంచేసి చీపుర్లు కడుతున్నాను.

అంతలో అక్కయ్య వచ్చింది పెరట్లోకి.

"వాణీ ఇంట్లో హడావుడిగా వుందేమిటే?" అంది.

"వాణీని చూడటానికి పెళ్ళికొడుకు వచ్చేడు" అన్నాను సంబ రంగా. అనుకోకుండానే నా ముఖంలో ఆనందం పొంగి వచ్చింది.

అక్కయ్య ముఖం ముడుచుకుంది.

"ఏం సంబరమే తల్లీ! ఆ పెళ్ళికొడుకు నీకు వచ్చినట్టే కులుకు తున్నావ్! నీ మొహానికి అదొక్కటే తక్కువ" అంటూ లోనికి వెళ్ళి పోయింది.

నాకు గుండెలు పిండినట్లు అన్పించింది.

ఆ రాత్రినుండీ నా మదిలో కొత్త ఊహాలు ప్రారంభమయ్యాయి.

"వాణీ మొగుడులాటి కుర్రాడు నన్ను చేసుకుంటే ఎంత బాగుం డును?" అనుకున్నాను. ఈ రకమయిన ఊహతో ఆ రాత్రి నిద్రే పట్ట లేదు.

• • •

పదిహేను దినాలు తిరగకుండానే ఆ అబ్బాయితో వాణీ వివాహం నిశ్చయమైపోయింది. వచ్చే మాఘమాసంలో పెళ్ళిచేస్తారట.

నేను చాటుగా వాణీని కల్సుకున్నపుడు ఆమెకు కాబోయే భర్తను గురించిన వివరాలన్నీ అడిగేను. వాణి అతడిని గురించి గర్వంగా ఎన్నో విషయాలు చెప్పింది.

వాళ్ళు వారానికి రెండు సినిమాలయినా కనీసం చూస్తారుట! ఎప్పుడూ కారులోనే తిరుగుతారుట! పట్నంలో పెద్ద మేడలు రెండు వున్నాయట! ఎన్నో విషయాలు వాణీ చెప్తూంటే ఆశ్చర్యంతో విన్నాను. వాణిమీద నాకు అసూయ కూడా కల్గింది.

ఒక దినం మధ్యాహ్నం అక్కయ్య బజ్జీలు చేస్తోంది. నేను అరటి కాయను చెక్కు తరిగి ముక్కలుకోసి ఇస్తున్నాను. అక్కయ్య పొయ్యి దగ్గర నిలబడి బజ్జీలు వేయిస్తోంది. వంటింట్లోకి గాలి రాకపోవటం వలన చెమట పట్టేస్తోంది. చేతుల నిండా అరటికాయ జిగురుతో చికాకుగావుంది. ముఖాన్ని ముందుకువంచి మోకాలిదగ్గర పరికిణీ అంచుతో చెమట అద్దు! కున్నాను. "సిగ్గులేదూ! మోకాళ్ళ వరకూ పరికిణీ! ఎత్తుకొని కూర్చున్నావ్ ఇంకా పాపాయివనుకుంటున్నా వేమిటి? ఛీ" అంటూ చేతిలోని వేడి అట్ల కాడతో నా తొడమీద వాతపెట్టింది.

బాధతో కెవ్వుమని అరిచాను.

నా అరుపువిని బావ వచ్చేడు. "ఏం జరిగింది?" అంటూ. నేను ఏడుస్తూ పెరట్లోకి వెళ్ళిపోయాను.

తరువాత బావ అక్కయ్యను కసరటం విన్పించింది.

అక్కను కసిరినంతలో నా బాధ ఎలా తీరుతుంది?

ఆ రాత్రి భోజనం కూడా సరిగా దిగలేదు.

తొడమీద రెండు వేళ్ళ దళసరిని ఎర్రగా వాచిపోయింది.

బాధతో నిద్రపట్టక ఇటూ అటూ దొర్లుతున్నాను.

తాలూకా కచ్చేరిలో పన్నెండు గంటలు కొట్టిన శబ్దం విన్పించింది.

అంతలో లోపలిగది తలుపులు తెరుచుకున్నాయి.

బావ మెల్లగా నడుస్తూ నా వద్దకు వచ్చేడు.

"కమలా!" మెల్లగా పిలిచేడు.

"ఊఁ" అన్నాను.

"నొప్పిగా వుందా ?"

నేనేం మాట్లాడలేదు. బావను చూస్తుంటే దుఃఖం ఉబికి వచ్చింది.

"ఛ! ఏడవకూడదు" అంటూ మెల్లగా వంగి నా ప్రక్కలో

కూర్చొని బుగ్గలమీద తుడిచేడు. బావ చేతులు నా బుగ్గలు మీదినుండి భయంగా తొలగించేను. బావ నా ప్రక్కన కూర్చుంటే నాకు అదోలా వుంది.

“ఏది వాత? ఎక్కడ పెట్టిందో చూడనీయి !” అంటూ నా పరికిణీని మెల్లగా మోకాళ్ళవరకూ జరిపేడు. సిగ్గుతో ముడుచుకుపోయాను.

బావ చేతిని నా తొడలమీదనుండి మెల్లగా తొలగించేను.

గదిలో చిన్నదీపం వెలుగుతోంది.

ఆ దీపం వెలుగులో బావ ముఖం వింతగా కనుపిస్తోంది.

“ఉండు, మందుతెస్తాను” అంటూ లేచి వెళ్ళి ఏదో ట్యూబ్ తీసుకొని వచ్చాడు. ఈసారి మరింత దగ్గరిగా జరిగి కూర్చున్నాడు.

పరికిణీ చొరవగా తొలగించి మందు రాస్తుంటే అభ్యంతరం చెప్పలేకపోయాను.

“మీ అక్క మనిషి కాదు, రాక్షసి” అన్నాడు.

నేనే సమాధానం చెప్పలేదు.

మందు రాస్తున్న బావ చేతివేళ్ళు వణుకుతున్నట్లు అనిపించింది.

విభ్రాంతిగా బావవైపు చూసేను. బావ కళ్ళు ఎర్రగా వున్నాయి.

బావ పెదాలపై భయంతో కూడిన చిరునవ్వు.

బావ క్రమంగా నన్ను ఆక్రమించుకుంటున్నాడు.

జరగబోయేది నాకు లీలగా అర్ధమవుతోంది.

ఏదో మాట్లాడాలనుకున్నాను.

కాని కొంతసేపు నోరు పెగల్లేదు.

బావ పెదాలు నా ముఖంమీద దేనికోసమో ఆత్రంగా వెదకుతున్నాయి. భయంతో ఒడలంతా చెమటలు పట్టింది.

శక్తులన్నిటినీ కూడగట్టుకొని “అక్కయ్యా !” అని గట్టిగా అరిచేను. బావ ఉలిక్కిపడి నన్ను వదిలి లేచిపోయాడు. నేను ఒక్క ఉదు

టున లేచి అక్కయ్య గదివైపు పరుగెత్తేను. తలుపులు తెరచుకొని బయటకు వస్తున్న అక్కయ్యను గట్టిగా కౌగలించుకున్నాను.

బావ తలవంచుకొని గబగబా అడుగులు వేసుకుంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

అక్కయ్య వేళ్ళు నా తలలో ఆప్యాయంగా కదిలేయి! అక్కయ్య మోచేతులు నా వెన్నుమీద ప్రేమతో నిమిరేయి. "వాళ్ళకేం తల్లీ ! వాళ్లు మగమహారాజులు....—" అంటూ గొణిగింది. నన్ను యింకా దగ్గరకు తీసుకుంటూ.

మరుసటి దినం నుండి నాకు సంబంధాలు వెదకడం ప్రారంభించింది అక్కయ్య.